క్లుప్తంగా...

జవహర్‌నగర్‌లో శరవేగంగా ప్రగతి పనులు



జవహర్‌నగర్‌లో ప్రగతి పనులను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 14, 23వ డివిజన్లలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు ఆలూరి సంగీతారాజశేఖర్, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రూ.30 లక్షలతో ప్రగతి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో ఎక్కడ చూసినా ప్రగతి పనులతో పరుగులు పెడుతుందన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు..



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐ మహేందర్‌రెడ్డి ఆదేశానుసారం జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారి వెంకటనారాయణ, స్థానిక ఎస్సై అశోక్ బుధవారం పరిశీలించారు. పరిశీలన అనంతరం ఎన్ఎఫ్‌సీనగర్ వంతెన నుంచి యంనంపేట్ చౌరస్తా వరకు ప్రమాదకరంగా ఉందని తేల్చారు. వందన హోటల్, యంనంపేట్ చౌరస్తా మధ్య మైసమ్మగుట్టకు వెళ్లేందుకు డివైడర్‌ను తొలగించి ఏర్పాటు చేసిన రోడ్డు వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించారు. ప్రమాదాల నివారణకు మైసమ్మగుట్టకు పాదచారులు వెళ్లే డివైడర్‌ను పూర్తిగా మూసివేయాలన్న నిర్ణయానికి వచ్చారు. రెండు, మూడు రోజుల్లో రోడ్డును మూసివేసి కొన్ని రోజుల పాటు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

వైద్యం కోసం వచ్చిన వ్యక్తి మృతి

కీసర: కీసరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన వ్యక్తి మృతిచెందడం వివాదాస్పదమైంది. వివరాల్లోకి వెళ్లితే యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జియపల్లితండాకు చెందిన దారవత్ శ్రీనివాస్ నాయక్(35) డ్రైవర్. బుధవారం కడుపు నొప్పితో బాధపడుతూ కీసర ప్రధాన చౌరస్తాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చాడు. అతడిని పరీక్షించిన వైద్యుడు ఓ ఇంజక్షన్ ఇచ్చారు. అనంతరం కొన్ని టెస్టులు చేయాలని చెప్పడంతో అతడి బంధువులు ఈసీఐఎల్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు యత్నించగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి అతడు మృతిచెందాడని ఆరోపించారు. అనంతరం మృతదేహంతో ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. కీసర పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టమ్ నివేదిక తర్వాత వాస్తవాలు తెలుస్తాయన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఘట్‌కేసర్ జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో చెత్తా చెదారం



ఘట్‌కేసర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దుస్థితి

సాక్షి ఫోకస్

ఇవి స్కూళ్లేనా..?

సమస్యల వలయంలో ప్రభుత్వ స్కూళ్లు

- స్కూళ్లు ప్రారంభమైనా వెక్కిరిస్తున్న సమస్యలు
- సరిపడా గదులు లేక వరాండాల్లోనే చదువులు
- తాగునీటి సౌకర్యం లేక ఇంటి నుంచే నీరు
- ప్రతిరోజూ విద్యార్థులకు తప్పని అవస్థలు
- నిర్లక్ష్యం వీడని విద్యాశాఖ అధికారులు
- అటువైపు కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు



నారపల్లి స్కూల్లో ఆరుబయట కూర్చున్న విద్యార్థులు



మేడ్చల్‌లో మధ్యాహ్న భోజనం చూపిస్తున్న విద్యార్థి

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలో చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో చిక్కుకొని విలవిల్లాడుతున్నాయి. నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీల్లో 145 ప్రాథమిక పాఠశాలలు, 59 ఉన్నత పాఠశాలలు ఉండగా కొన్ని పాఠశాలల్లో అదనపు గదుల అవసరం ఉంది. బోధనకు కావాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య లేకపోవడం, ఖాళీలు ఎక్కువగా ఉండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. చాలా వరకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మూత్రశాలలు ఏర్పాటు చేసినా వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని పాఠశాలలో ఫర్నిచర్ కొరత కనిపిస్తోంది. స్కూళ్లు మొదలైనా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మేడ్చల్ మండలంలో..

మండలంలో 13 ఉన్నత పాఠశాలలు 37 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో దాతలు సహకారం అందించడంతో మెజార్టీ పాఠశాలల పరిస్థితి మెరుగ్గానే ఉంది. మండలంలో 110 మంది టీచర్లు పని చేయాల్సి ఉండగా 104 మంది పని చేస్తుండగా 6 ఖాళీలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలో మూత్రశాలల నిర్వహణ సరిగా లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

కీసరలో..

కీసర మండలంలో 7 ఉన్నత పాఠశాలలు, 28 ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ ఉన్నాయి. ఇందులో కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత, మూత్రశాలలు, తాగునీటికి సమస్యలున్నాయి. ఇక ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ ఆవరణలను ఇప్పటి వరకు శుభ్రపరచలేదు. దీంతో కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఘట్‌కేసర్‌లో..

మండలంలో 13 జెడ్పీ పాఠశాలలు, 18 ప్రాథమిక, 2 యూపీఎస్ స్కూళ్లు ఉన్నాయి. చాలా పాఠశాలల్లో మన ఊరు–మన బడి నిర్మాణాలు అందుబాటులోకి రాలేదు. తాగునీటి కొరత ఉంది. మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. ఉన్న వాటిలో నీటి సదుపాయం లేదు. పాఠశాలల ఆవరణ చెత్తా చెదారం, వ్యర్థాలతో నిండి ఉంది. కొన్ని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పోచారంలో ఫర్నీచర్ కొరత కనిపించింది.





కీసరదాయర ప్రైమరీ పాఠశాల్లో దుస్థితి



వికలాంగులకు బస్‌పాస్‌ల అందజేత



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లోని వికలాంగులకు ఇబ్బందులు రాకుండా ఆర్టీసీ బస్‌పాస్‌లను సర్పంచ్ కావేరి, మశ్చేందర్‌రెడ్డి దంపతులు సొంత నిధులతో రెన్యూవల్ చేయించారు. రెన్యూవల్ చేయించిన బస్‌పాస్‌లను వికలాంగులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగులు సర్పంచ్ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

పిల్లలకు బైక్‌లు ఇవ్వొద్దు



మేడ్చల్: పట్టణ పరిధిలో మైనర్ డ్రైవింగ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దని ఆయన కోరారు. మైనర్ల డ్రైవింగ్‌తో ఇతరులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తాము కఠినంగా వ్యవహరిస్తున్నా ఏదో ఒక ప్రాంతంలో మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. కేసులు నమోదు చేసి చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాగారంలోని శ్రీభవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానం తరఫున త్వరలో నోట్‌బుక్స్ పంపిణీ చేయనున్నట్లు ఆలయ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ త్వరలో మాధవానంద సరస్వతి స్వామిచేతుల మీదుగా విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేస్తామన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న సుమారు 2,300 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

'పల్లె ప్రగతి'ని ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవాన్ని మేడ్చల్ జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. ఈ మేరకు బుధవారం పల్లె ప్రగతి దినోత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై డీపీఓ రమణమూర్తితో సహా పలువురు అధికారులకు కలెక్టర్ పలు సూచనలతో కూడిన ఆదేశాలను జారీ చేశారు. పల్లె ప్రగతితో గ్రామాలు, తండాలకు వచ్చిన నిధుల వివరాలతోపాటు ప్రభుత్వం ద్వారా చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలపాలని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం రాక ముందు నాటి పరిస్థితులను అద్దం పట్టేలా పేర్కొంటూనే.. పదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, పారిశుద్ధ్యం, పచ్చదనం, పంచాయతీలకు ట్రాక్టర్లను అందించడం, పక్కా భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు, హరితహారం ద్వారా మొక్కల పెంపకం, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలను ఫొటోలతో సహా ప్రజలకు చూపించాలని సూచించారు. గ్రామీణ జీవన ప్రమాణాలు పెరిగిన తీరును ప్రస్తావించి, ఉత్తమ గ్రామ పంచాయతీ సర్పంచులు, ఉత్తమ మండలాల ఎంపీపీలను ఘనంగా సన్మానించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారితో పాటు తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో ప్రభుత్వ నిబంధలు, సూచనల అనుగుణంగా పల్లెప్రగతి దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.

వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట: మంత్రి



మేడ్చల్ పట్టణంలో గర్భిణికి న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో బీటీరోడ్డు, వైకుంఠధామం నిర్మాణపనులకు శంకుస్థాపనలో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందజేసేందుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన వైద్య ఆరోగ్య దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో గర్భిణులకు అందిస్తున్న న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని, ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తుందని అన్నారు. ఇందులో భాగంగానే జిల్లాకు ఒక 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తుందని, బస్తీ, పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు అన్ని వసతులు కల్పించామన్నారు. కేసీఆర్ కిట్లు అందజేస్తూ వారికి అండగా ఉంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మెరుగైన సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు గౌరవప్రదమైన వేతనాలు అందజేస్తున్న ఘనత తమదే అన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, జేసీ నర్సింహారెడ్డి, ఎంపీపీలు రజిత రాజమల్లారెడ్డి, ఎల్లుబాయి, హారిక మురళీగౌడ్, జెడ్పీటీసీ శైలజావిజయానంద్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్, డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీనివాస్, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు

కీసర: మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నట్లు మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో సుమారు రూ.73 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులతో పాటు అహ్మద్‌గూడ హరిదాస్‌పల్లి రహదారిలో సుమారు రూ.కోటి నిధులతో వైకుంఠధామం(శ్మశాన వాటిక) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్‌నగర్ చెత్తడంపింగ్ యార్డుకు సమీపంలో ఉన్న దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో చెరువుల్లో మురుగు చేరకుండా రూ.కోట్లు వెచ్చించి పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు. మిషన్ భగీరథ కింద ఇంటింటికీ నల్లా నీటిని అందిస్తున్నట్లు చెప్పారు. దమ్మాయిగూడ ప్రధాన రహదారి విస్తరణకు కూడా నిధులు కేటాయించినట్లు వివరించారు. అహ్మద్‌గూడలో సుమారు రూ.2 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి దమ్మాయిగూడ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు మాదిరెడ్డి పావనిరెడ్డి, స్వప్నహరిగౌడ్, నాగయపల్లి సుజాతశ్రీనివాస్, నానునాయక్, కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, కొత్త హేమలతశ్రీనివాస్‌గౌడ్, మోర మౌనికనరహరిరెడ్డి, పాండాల అనురాధ, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొకుట్ల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ సీసాల ముసుగులో మద్యం దందా

- సుంకం చెల్లించని 521 మద్యం బాటిళ్లు స్వాధీనం
- ఐదురుగు నిందితుల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న సుంకం చెల్లించని మద్యం బాటిళ్లు

పోచారం: గోవా నుంచి డీసీఎంలో ఖాళీ సీసాలతో పాటు అక్రమంగా సుంకం చెల్లించని మద్యం బాటిళ్లను రవాణా చేస్తున్న కీలక వ్యక్తులను ఘట్‌కేసర్, మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో రంగారెడ్డి రీజియన్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్ బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సిద్దిపేట్‌కు చెందిన తాళ్లపల్లి హరికృష్ణగౌడ్‌కు గోవాలో బార్ ఉండేది. బార్ అమ్మేసి రెస్టారెంట్ నడిపిస్తున్నాడు. ఇతను గోవా నుంచి డీసీఎంలో ఖాళీ సీసాలతో పాటు ఎవరికీ అనుమానం రాకుండా సుంకం చెల్లించని మద్యం బాటిళ్లను హైదరాబాద్‌కు రవాణా చేసేవాడు. మద్యం ధరను మూడు రెట్లు పెంచి పరిచయస్తులకు అమ్మేవాడు. మంగళవారం సాయంత్రం బోడుప్పల్‌లోని బంగారు మైసమ్మగుడి వద్ద తనిఖీలు చేస్తుండగా అలగొండ జగదీశ్వర్(54) వద్ద సుంకం చెల్లించని రెండు లీటర్ల సిగ్నేచర్ విస్కీ బాటిళ్లు 10 దొరికాయి. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని మద్యంతో పాటు ద్విచక్రవాహనాన్ని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

◆ నిందితుడు జగదీశ్వర్‌ను విచారించగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీకి చెందిన పున్నా బాలరాజ్(53) వద్ద కూడా మద్యం బాటిళ్లు ఉన్నట్లు చెప్పాడు. సమాచారం ఆధారంగా పోలీసులు బాలరాజ్‌ను అదుపులోకి తీసుకుని సోదాలు నిర్వహించారు. అతడి కారులో సిగ్నేచర్ విస్కీ బాటిళ్లు 27, రాయల్ చాలెంజ్ బాటిళ్లు 19, రిజర్వ్ 7 విస్కీ బాటిళ్లు 20 దొరికాయి. ఈ మద్యం సీసాలతో పాటు కారు, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

◆ నిందితుడు జగదీశ్వర్ తెలిపిన మరిన్ని వివరాల ఆధారంగా సిద్దిపేటలో తాళ్లపల్లి హరికృష్ణగౌడ్(43), బుచ్చిగారి శ్రీధర్(29) ఇళ్లను సోదా చేశారు. సోదాల్లో రాయల్ చాలెంట్ బాటిళ్లు 189, సిగ్నేచర్ రేర్ విస్కీ బాటిళ్లు 66, రిజర్వ్ 7 విస్కీ బాటిళ్లు 129, రియల్ విస్కీ బాటిళ్లు 18 లభించాయి. మద్యంతో పాటు డీసీఎం, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

◆ అసలు సూత్రధారి హరికృష్ణను పోలీసులు విచారించగా మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వివరాల ఆధారంగా నాచారంలోని అంబేడ్కర్ భవన్ సమీపంలో ఉంటున్న ఆముదాల సురేందర్ (34) ఇంట్లో సోదాలు నిర్వహించగా సిగ్నేచర్ రేర్ ప్రీమియం విస్కీ బాటిళ్లు 27, రాయల్ చాలెంజ్ విస్కీ బాటిళ్లు 19 దొరికాయి. మద్యంతో పాటు కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

◆మొత్తం 521 మద్యం బాటిళ్లు, రెండు కార్లు, డీసీఎం, ద్విచక్ర వాహనం, 5 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హరికృష్ణగౌడ్, జగదీశ్వర్, సురేందర్, శ్రీధర్, బాలరాజ్‌లను కోర్టు ద్వారా రిమాండ్ చేశారు. సమావేశంలో అబ్కారీ శాఖ జిల్లా అధికారి డి.అరుణ్ కుమార్, సూపరింటెండెంట్ ముకుంద్‌రెడ్డి, సీఐ ఎం.మల్లయ్య, ఎస్సై ఆకుల శ్రావణి, ఇతర సిబ్బంది అశోక్, మక్బూల్, వెంకట్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఎక్కి వ్యక్తి వీరంగం

మేడ్చల్‌రూరల్: మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కి ఓ వ్యక్తి వీరంగం సృష్టించిన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబంలో రూ.9 వేల కోసం జరిగిన గొడవ కారణంగా మున్సిపాలిటీ పరిధి అత్వెల్లిలో నివాసముండే బావికాడి గణేష్(31) మద్యం మత్తులో బుధవారం సాయంత్రం పట్టణంలో జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఎక్కాడు. మేడ్చల్ పోలీసులు అతడికి నచ్చజెప్పి కిందకు దించారు. అతడికి రావాల్సిన రూ.9 వేలను ఎస్ఐ మురళీధర్ ఇప్పించాడు. కరెంట్ సరఫరా లేకపోవడంతో అతడికి ప్రాణహాని చోటుచేసుకోలేదు.

వైద్య వృత్తి పవిత్రమైంది



ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిని సత్కరిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు.

ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఆసత్రిలో వైద్య దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు, నర్సులను శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కరోనా విపత్కర సమయంలో వైద్యసిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు అందించిన సేవలు వెలకట్టలేనివని అన్నారు. నిస్వార్థంగా సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు మీనా, జంగయ్యయాదవ్, రహీం, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.